


# రుసుం చెల్లింపే భారం!

● జీఓ 59కు విరుద్ధంగా మార్కెట్ విలువ ప్రకారం సొమ్ము చెల్లించాలన్న నోటీసులతో అయోమయం
● 45 రోజుల గడువు ఉండటంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

## 15 వేల మంది లబ్ధిదారుల్లో సొమ్ము చెల్లించింది 195 మంది మాత్రమే..

భూక్రమబద్ధీకరణ జీఓ–59లో పేర్కొన్న ఉత్తర్వులకు భిన్నంగా సొమ్ము చెల్లించాలని అర్హత పొందిన దరఖాస్తుదారులకు జారీ అయిన నోటీసులపై స్పందన నామ మాత్రంగానే ఉంది. ప్రభుత్వ భూముల్లో నివాసిత ఇళ్ల క్రమబద్ధీకరణలో భాగంగా జీఓ–59 కింద అర్హత సాధించిన 15 వేల దరఖాస్తుదారుల్లో ఇప్పటి వరకు 195 మంది మాత్రమే సొమ్ము చెల్లించారు. మిగతా దరఖాస్తుదారులు సొమ్ము చెల్లించేందుకు వెనుంజ వేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం జీఓ పేర్కొన్న ఉత్తర్వులకు విరుద్ధంగా.. ప్రస్తుత మార్కెట్ విలువ లెక్క కట్టి రూ.లక్షల్లో సొమ్ము చెల్లించాలని నోటీసులు అందటమేనని తెలుస్తోంది. దీంతో ఏమి చేయాలో తోచక వారు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరిగినా.. తాము ఏమీ చేయలేమని, ప్రభుత్వమే తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి,మేడ్చల్ జిల్లా

### అర్హత పొందిన దరఖాస్తుదారులు వీరే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జీఓ–59 కింద భూ క్రమబద్ధీకరణకు 28,280 లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా.. విచారణ, తుది పరిశీలన అనంతరం 15 వేల దరఖాస్తులు మాత్రమే అర్హత సాధించినట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో 15 వేల మంది దరఖాస్తుదారులకు సొమ్ము చెల్లించాలని పేర్కొంటూ.. నోటీసులు జారీ చేశారు. నో టీసులు జారీ అయిన 45 రోజుల్లో సొమ్ము చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ ఇప్పటి వరకు 195 మంది దరఖాస్తుదారులు మా త్రమే పూర్తి స్థాయిలో సొమ్ము చెల్లించినట్లు అధికార వర్గా లు పేర్కొంటున్నాయి.

### సొమ్ము చెల్లింపులు ఇలా...

జీఓ–59 కింద 250 గజాల లోపు ఇళ్లు నిర్మించుకుంటే... ఆ ప్రాంతంలో ప్రభుత్వ ధరలో 25 శాతం సొమ్ము చెల్లించాలని రెవెన్యూ శాఖ తెలిపింది. 251 నుంచి 500 గజాల్లో ఇళ్లు నిర్మించుకుంటే 50 శాతం సొమ్ము, 500 నుంచి 1000 గజాల లోపు ఇళ్లు నిర్మించుకుంటే 75 శాతం సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని 59 జీఓలో తెలిపారు. ఒకవేళ 1000 చదరపు గజాల పైన ఇంటి నిర్మాణ స్థలం ఉన్నట్లయితే.. ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలకు ఇదే చివరి అవకాశమని, ప్రభుత్వం జీఓ–14 ప్రకారం.. 2014 జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లను మాత్రమే క్రమబద్ధీకరిస్తామని ఆ జీఓలో పేర్కొంది.

### లబ్ధిదారుల్లో ఆందోళన..

జీఓ–59కు విరుద్ధంగా సీసీఎల్ఏ ద్వారా కలెక్ట ర్ పేరుతో జారీ చేసిన సొమ్ము చెల్లింపుల నో టీసులపై తీవ్ర ఆందో ళనకు గురైన లబ్ధిదారులు ప్రభుత్వ ఆఫీసుల చు ట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ ధర కు అనుగుణంగా పెద్ద మొత్తంలో సొమ్ము చెల్లించలేమని ఆవేదన చెందుతున్నారు. నివాస స్థలాల క్రమబద్ధీకరణలో భాగంగా రూ.10లక్షల నుంచి రూ.80 లక్షలను గడువులోగా చెల్లించాలనడంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. జీఓలో పే ర్కొన్న ఉత్తర్వులకు విరుద్ధంగా జారీ చేసిన నోటీసులపై ప్రభుత్వ పెద్దలు పునరాలోచించి న్యాయం చేయాలని లబ్ధిదారులు వేడు కుంటున్నారు.

**మండలాల వారీగా...**

| మండలం | వచ్చిన మొత్తం దరఖాస్తులు |
|---|---|
| కుత్బుల్లాపూర్ | 14,518 |
| కాప్రా | 5081 |
| కూకట్‌పల్లి | 5055 |
| ఉప్పల్ | 457 |
| దుండిగల్ | 1656 |
| మల్కాజిగిరి | 1424 |
| బాచుపల్లి | 1412 |
| మేడిపల్లి | 583 |
| బాలానగర్ | 389 |
| కీసర | 697 |
| ఘట్‌కేసర్ | 623 |
| శామీర్‌పేట | 677 |
| అల్వాల్ | 346 |
| మేడ్చల్ | 311 |
| ఎంసీపల్లి | 29 |

## క్లుప్తంగా...

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కీసర: మరమ్మతుల కారణంగా కీసర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని చీర్యాల జేఎస్ఎంయూఆర్ కాలనీ, చీర్యాల ఎన్‌జీఆర్ కాలనీ, అహ్మద్‌గూడ, హరిదాస్‌పల్లి, వీఆర్ఆర్ హోమ్స్, ఠాకూర్ కాలనీ, మోడీ అపార్ట్‌మెంట్, సింధువనం, శ్రీరామ్‌నగర్, ఆర్‌జీకే కాలనీ, పల్లవి స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉ.10 నుంచి సా.5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

### అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఘట్‌కేసర్: కొర్రెముల్‌కి చెందిన ఎల్లమ్మ బుధవారం ఉదయం మరణించింది. సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు ఆమె అంత్యక్రియల నిమిత్తం సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ తన సొంతంగా రూ.10వేలు మృతురాలి కుటుంబీకులకు అందజేశాడు. ఉప సర్పంచ్ రాజుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### కంటి పరీక్షలు చేయించుకోవాలి



మేడ్చల్: కంటి సమస్యలు ఉన్న వారు తప్పనిసరిగా కంటి వెలుగులో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహ రెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ దేవతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా శివ పడిపూజ



మేడ్చల్‌రూరల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో మామిండ్ల వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో 12వ శివ పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, సర్పంచ్ మహేందర్, యూత్ అధ్యక్షులు హరత్‌రెడ్డి, శివ మాలధారులు పాల్గొన్నారు.

### 'ఎలాంటి గేట్లు మూయలేదు'

మేడ్చల్: గుండ్లపోచంపల్లి పరిధిలోని ఎప్సిలన్ వెంచర్‌లో అసోసియేషన్ ఎలాంటి గేట్లు మూయలేదని వెంచర్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్‌రావు తెలిపారు. వెంచర్ గేటెడ్ వెంచర్ కాదని, ఓపెన్ వెంచర్‌గానే ఉన్న దానిని అభివృద్ధి చేయడానికి ప్లాట్ల యజమానుల వద్ద నిర్వహణ కోసం డబ్బులు తీసుకుంటున్నామే గానీ కొన్నా..అమ్మినా.. ఎలాంటి కమిషన్లు తీసుకోవడం లేదని చెప్పారు. తూర్పు గేటు రైల్వే సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం వల్ల కాంట్రాక్టర్ మూసివేశాడని, తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. వెంచర్‌లోని కొంత మంది అక్రమంగా కబ్జాలు చేస్తున్నారని, వాటిపై తాము ఫిర్యాదు చేస్తే తట్టుకోలేక అసోసియేషన్‌పై బురద జల్లుతున్నారని అన్నారు. ప్లాట్ల యజమానులు ఎలాంటి మాటలు నమ్మొద్దని, అసోసియేషన్ వెంచర్ అభివృద్ధికి కృషి చేస్తుందని శ్రీనివాసరావు తెలిపారు.

### 'బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం చేశారు'

మేడ్చల్: రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరించి విద్యార్థులకు తీరని అన్యాయం చేశారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ రాథోడ్ అన్నారు. బడ్జెట్‌ను నిరసిస్తూ మేడ్చల్‌లో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించి రాస్తారోకో చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, కార్తీక్, భరత్, ప్రవీణ్, జైకృష్ణ, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కుష్ఠు నిర్మూలనపై అవగాహన

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీరంగవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబు యాదవ్, వైద్యులు పాల్గొని విద్యార్థులకు కుష్ఠు వ్యాధి లక్షణాలు, నిర్మూలనపై వివరించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రతిభ, మహేశ్, పాఠశాల హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన బీజేపీ శ్రేణులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో గ్రామంలో అక్రమాలకు పాల్పడిన అధికారులు, ప్రజాప్రతినిధులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి డిమాండ్ చేశారు. ఎదులాబాద్ పంచాయతీ కార్యాలయం ఎదుట బీజేపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌రావుతో కలిసి బుధవారం నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలకు జరిగిన అన్యాయాన్ని బీఆర్ఎస్ నాయకులు పక్కదారి పట్టించాలని చూస్తే వారికి న్యాయం జరిగే వరకు గ్రామ ప్రజలతో కలిసి బీజేపీ పోరాటం చేస్తోందన్నారు. ఈ నిరసనలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఓబీసీ రాష్ట్ర నాయకుడు రామోజీ, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, బీజేపీ స్థానిక శాఖ అధ్యక్షుడు కుమారస్వామి, సాయికిరణ్, మల్లేశ్, హరికృష్ణ, వెంకట్, రాజేశ్, చిరంజీవి, నాగరాజు, ఆంజనేయులు, శ్రీను, నరసింహ, ప్రవీణ్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

## క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు

ఘట్‌కేసర్: క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ త్వరగా గుర్తింపు లభిస్తోందని అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల(వీబీఐటీ) చైర్మన్ ఎన్.గౌతంరావు, కార్యదర్శి జి.మనోహర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ బిట్స్ పిలాని క్యాంపస్‌లో ఇటీవల జరిగిన ఎరీనా–23 నేషనల్ కబడ్డీ చాంపియన్ షిప్‌లో రన్నర్‌ప్‌గా నిలిచిన వీబీఐటీ కబడ్డీ క్రీడాకారిణులకు కళాశాలలో బుధవారం సభ ఏర్పాటు చేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారిణులు పాల్గొన్నారు.



క్రీడాకారిణులను అభినందిస్తున్న గౌతంరావు, మనోహర్‌రెడ్డి

## హీలియం బెలూన్ పేలి నలుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజు యాదవ్

కీసర: ప్రమాదవశాత్తు హీలియం బెలూన్ పేలి నలుగురికి తీవ్ర గాయలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కీసరలోని వీఆర్ఆర్ వెంచర్‌లో రియల్టర్ వంగేటి రాజిరెడ్డి(వీఆర్ఆర్) తన పుట్టిన రోజు సందర్భంగా వెంచర్‌లో శుభాకాంక్షలతో కూడిన హీలియం బెలూన్‌ను గాలిలో ఎగరేశారు. మంగళవారం సాయంత్రం బెలూన్‌ను కిందకి దించే క్రమంలో ప్రమాదవశాత్తు బెలూన్ ఒక్కసారిగా పేలింది. దీంతో అందులో పనిచేస్తున్న సీరజ్(46), అంజిరెడ్డి(45), సుధీర్‌గౌడ్(30), రాజుయాదవ్(27)లు తీవ్రంగా గాయపడ్డారు. బెలూన్‌లోని హీలియం కారణంగా మంటలంటుకొని తల, చేతులు, కాళ్లు, చర్మం కాలిపోయింది. దీంతో నలుగురిని నగరంలోని జీనియా, సువిధ ఆస్పత్రుల్లో చికిత్స నిమిత్తం వారిని తరలించారు. కాగా అక్రమంగా బెలూన్‌ను ఎగరేసి నలుగురికి తీవ్ర గాయాలు కావడానికి కారణమైన రాజిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం గ్రామ కార్యదర్శి వీఆర్ఆర్ వెంచర్‌లో పర్యటించి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

## హ్యాండ్‌బాల్ పోటీలకు ఎమ్మార్ఐటీఎస్ విద్యార్థిని ఎంపిక

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని ఎమ్మార్ఐటీఎస్ కళాశాల విద్యార్థిని ఆల్ ఇండియా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయిశ్రేయ ఇటీవల నిర్వహించిన సెలక్షన్లలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీకి ఎంపికైంది. ఈ నెల 15న కేరళ రాష్ట్రంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొననుంది. సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని సాయిశ్రేయను కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర, పీడీ వెంకట నారాయణ, అధ్యాపకులు అభినందించారు.



సాయిశ్రేయను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్ర

### పోలీసుల అదుపులో నిందితులు?

ఘట్‌కేసర్: అవుషాపూర్ గ్రామానికి చెందిన మౌలానా మద్యం మత్తులో గుర్తు తెలియని విషం కలుపుకొని సేవించిన ఘటనలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. మరణంపై బంధువులు, స్థానికులు మొదటి నుంచి అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బంధువులు, స్థానికుల అనుమానం మేరకు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. కేసులో ఎవరెవరు ఉన్నారు? బయటి వ్యక్తుల హస్తం ఉందా? మద్యం, విషం ఎక్కడ కొనుగోలు చేశారన్న విషయాలపై పోలీసులు ఆరా తీసున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు పోలీసుల ద ర్యాప్తులో తెలియనుంది. కాగా ఈ కేసులో గ్రామానికి చెందిన మరొక వ్యక్తి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

### కాచవానిసింగారంలో అదనపు కలెక్టర్ పర్యటన

శామీర్‌పేట్: కాచవానిసింగారం గ్రామాన్ని అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య బుధవారం సందర్శించి బృహత్ పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించారు. అదేవిధంగా పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నందకిశోర్, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### అక్రమ దస్తావేజును రద్దు చేయాలని వినతి

ఘట్‌కేసర్: ప్రజల అవసరాల నిమిత్తం గతంలో వదిలిన స్థలాన్ని వెంచర్ యజమాని తిరిగి ప్రైవేటు వ్యక్తులకు అక్రమంగా విక్రయించిన దస్తావేజును రద్దు చేయాలని కోరుతూ హెచ్ఎండీఏ కమిషనర్‌కు అవుషాపూర్ సర్పంచ్ కావేరిమశ్చేంద‌ర్‌రెడ్డి బుధవారం వినతి అందజేశారు. 1986లో అవుషాపూర్ సర్వే నంబర్.255, 261–264లలో ఏర్పాటు చేసిన న్యూసిటీ వెంచర్ బీ–సెక్టార్‌లో 2400 గజాల భూమిని పాఠశాల నిర్మాణం కోసం వదిలిపెట్టారు. అట్టి స్థలాన్ని వెంచర్ యజమాని ఇతరులకు విక్రయించారు. ఆ స్థలంలో అనుమతి కోసం పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా అనుమతి నిరాకరించామని లేఖలో పేర్కొన్నారు. ప్రజలకు చెందాల్సిన స్థలం ఇతరులకు దక్కకుండా అక్రమంగా చేసిన దస్తావేజును రద్దు చేయాలని ఆమె కమిషనర్‌ను కోరారు.

### మినీ ఫంక్షన్ హాల్ పనుల పరిశీలన

పోచారం: అన్నోజిగూడలోని ఎల్ఎన్ కాలనీలో రూ.30 లక్షల నిధులతో నిర్మిస్తున్న మినీ ఫంక్షన్ హాల్ పనులను చైర్మన్ కొండల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతరం నారపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో రూ.7.50 లక్షలతో నిర్మిస్తున్న వంట గదులు పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిలర్ చింతల రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఫంక్షన్ హాల్ పనులు పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

## బ్రహ్మోత్సవ పనుల్లో వేగం పెంచాలి

**అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య**



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య తదితరులు

కీసర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యేందుకు మరో వారం రోజులు మాత్రమే ఉన్నందున పనుల్లో వేగం పెంచాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. బుధవారం ఆయన కీసరగుట్టలో బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో రంగులు వేయడం, క్యూలైన్లు సిద్ధం చేయడం, చలువ పందిళ్ల ఏర్పాటు తదితర పనులు దాదాపు పూర్తి కావచ్చయని ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ అదనపు కలెక్టర్‌కు వివరించారు. కాగా కీసరగుట్ట జాతర జరిగే ప్రాంతం, పార్కింగ్ ప్రదేశాల్లో ఇప్పటి వరకు చదును చేసే పనులు ప్రారంభం కాకపోవడం పట్ల అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్, జాతర జరిగే ప్రాంతమంతా నిరంతరాయంగా మంచినీటి సరఫరా నిమిత్తం ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో పనులు, విద్యుత్ లైన్ల మరమ్మతులు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర పనులు కొనసాగుతున్నాయని ఎంపీడీఓ రమాదేవి వివరించారు. మూడు రోజుల్లో పనుల్లో పురోగతి కనిపించాలని సంబంధిత అధికారులకు అభిషేక్ అగస్త్య సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ మంగతాయారు, కీసర సర్పంచ్ మాధురి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మేడ్చల్ చైర్‌పర్సన్, కమిషనర్‌పై సీడీఎంఏకు ఫిర్యాదు

మేడ్చల్: మున్సిపల్ చైర్ పర్సన్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు మున్సిపల్ సీడీఎంఏ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు నగరంలోని సీడీఎంఏ కార్యాలయానికి చేరుకుని చైర్‌పర్సన్ దీపికపై ఫిర్యాదు చేశారు. చైర్‌పర్సన్, కమిషనర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ గతేడాది కాలంగా ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదని, శానిటేషన్, హరితహారం పనులను పట్టించుకోవడం లేదని, ప్రజా ధనం దుర్వినియోగం చేస్తూ పబ్బం గడుపుతున్నారని, 14 అంశాల్లో అవకతవకలు చేశారని ఆరోపించారు. కమిషనర్‌ను, ఆర్‌ఓను మేడ్చల్ నుంచి బదిలీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు హరికృష్ణ, నర్సింహ స్వామి, సాయికుమార్, రవిందర్‌రెడ్డి, సందీప్‌గౌడ్, మధుకర్‌యాదవ్, నరేందర్, రవిందర్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



సీడీఎంఏకు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శివపార్వతులు, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయంలో గ్రామస్థులు, నిర్వాహకులు చండీ హోమం, రుద్రహోమం, మన్యుసూక్త నవగ్రహ హోమాలు నిర్వహించారు. జగద్గురు శంకరాచార్యులు హంపీ స్వామి శోభాయాత్రను ప్రారంభించగా వేడుకలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులైన కౌన్సిలర్లు సరితమల్లేష్‌గౌడ్, మానస శ్రవన్‌కుమార్ గుప్తా, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## 'జీఓ 59 రుసుం చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్‌కు అర్హులు'

జవహర్‌నగర్: జీఓ–59 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారంతా రుసుము చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్‌కు అర్హులవుతారని కీసర ఆర్డీఓ రవి అన్నారు. ఈ మేరకు జీవో–59 క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారి కోసం బుధవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని రెవెన్యూ తహసీల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ రవి హాజరై దరఖాస్తు చేసుకున్న వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో–59 ప్రకారం.. అర్హులైన ప్రతి ఒక్కరూ డిమాండ్ నోటీసులతో చూపించిన విధంగా రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. జవహర్‌నగర్‌లో జీఓ–59 కింద 5067 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 2600 మందిని అర్హులుగా గుర్తించి ఇప్పటికే డిమాండ్ నోటీసులు అందించామన్నారు. నోటీసులో చూపిన విధంగా మూడు విడతల్లో బ్యాంకులో రుసుము చెల్లించాలని, రుసుము చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ లేకుండా వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ అనంతరం బ్యాంకు లోన్లు, ఇంటి పర్మిషన్ పొందవచ్చున్నారు. డిమాండ్ నోటీసులు పొందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా తహసీల్ కార్యాలయంలో సంప్రదించాలని, ఇందు కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను సైతం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కాప్రా మండల తహసీల్దార్ ఎస్తేరు అనిత, ఆర్ఐ విశ్వనాథ్, ఆనంద్, కార్పొరేటర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవి

పోలీసు భద్రత

## మరింత పటిష్టంగా..

### ప్రజలకు చేరువయ్యేలా మేడ్చల్ నియోజకవర్గంలో పోలీస్ వ్యవస్థ

● సర్కిల్ నుంచి డీసీపీ స్థాయికి మేడ్చల్
● ఆఫీసుల సంఖ్య పెరగడంతో తీరనున్న ప్రజల ఇబ్బందులు

మేడ్చల్: రాష్ట్రంలో వివిధ వ్యవస్థల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మేడ్చల్‌లో పోలీస్ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువగా మారింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మేళవింపుగా మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు, శాంతి భద్రతలను మరింతగా పరిరక్షించేందుకు నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేయనున్నారు.





మేడ్చల్ పోలీస్ స్టేషన్

#### సర్కిల్ నుంచి డీసీపీ స్థాయి వరకు..

సైబరాబాద్ ఆవిర్భవించక ముందు మేడ్చల్ నియోజకవర్గం రంగారెడ్డి ఎస్పీ పరిధిలో ఉండేది. నాడు ఒక ఎస్ఐ ఎస్‌హెచ్ఓగా ఉండేవారు. మేడ్చల్, శామీర్‌పేట్, దుండిగల్ పోలీస్‌స్టేషన్లకు కలిపి ఒక సీఐ ఉండే వారు. డీఎస్పీ నగరంలో ఉండేవారు. తదనంతరం చోటు చేసుకున్న మార్పులతో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీఐ ఎస్‌హెచ్ఓగా నలుగురు ఎస్ఐలు కలిసి ఒక స్టేషన్‌కు ఉన్నారు. అదే తరహాలో మేడ్చల్ పేట్‌బషీరాబాద్ ఏసీపీ పరిధిలో బాలానగర్ డీసీపీ జోన్ కింద నడిచింది. తాజాగా హోంశాఖ కసరత్తు చేసి డివిజన్ల పునర్విభజన చేయడంతో మేడ్చల్ పేరుపై ఉన్నతాధికారుల కార్యాలయాలు వచ్చాయి. బాలానగర్ డీసీపీ జోన్‌ను విభజించి మేడ్చల్, బాలానగర్ జోన్లుగా మార్చారు. దీంతో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మేడ్చల్ డీసీపీ జోన్‌గా ఏర్పడింది. పేట్‌బషీరాబాద్ ఏసీపీ జోన్‌ను పేట్‌బషీరాబాద్, మేడ్చల్‌గా విభజించి రెండు జోన్లుగా మార్చారు. మేడ్చల్ డీసీపీ జోన్ పరిధిలో మేడ్చల్, పేట్‌బషీరాబాద్ ఏసీపీలు ఉండగా, మేడ్చల్ ఏసీపీ పరిధిలో మేడ్చల్, శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇన్నాళ్లు ట్రాఫిక్‌లో అల్వాల్ పరిధిలో ఉండగా మేడ్చల్‌కు ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీంతో నాటి సీఐ స్థాయిలో నేడు ఏసీపీని ఏర్పాటు చేయడంతో పోలీస్ వ్యవస్థ ప్రజలకు దగ్గరగా చేరినట్లుంది.

#### తగ్గనున్న ప్రమాదాలు..

మేడ్చల్ ఏసీపీ పరిధిలోని 44వ జాతీయ రహదారి, రాజీవ్ రహదారిలు ఉన్నాయి. ఈ రెండు రోడ్లలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల సంఖ్య ఎక్కువే ఉండేది. ప్రమాదాల నివారణకు ఉన్నతాధికారులు చేపట్టబోయే చర్యలతో ప్రమాదాల సంఖ తగ్గే అవకాశం ఉంది.

#### నిఘా పెరిగితే నేరాలు తగ్గే అవకాశం...

మేడ్చల్‌లో అధికంగా పరిశ్రమలు, రిసార్టులు, వీఐపీలు నివాసం ఉండే విల్లాలు, అపార్ట్‌మెంట్లు ఉండటంతో వీఐపీల రాకపోకలతో ఈ ప్రాంతం బిజీగా ఉంటుంది. వివిధ రకాల పనులు, ఉపాధి కోసం దేశంలోని అన్ని ప్రాంతాల వారు స్థానికంగా ఉంటున్నారు. సహజంగానే వలస ప్రాంతాల్లో క్రైమ్ రేటు ఎక్కువగానే ఉంటుంది. ఇలాంటి ప్రాంతాలకు డీసీపీ, ఏసీపీ, ట్రాఫిక్ వంటి నూతన అధికారులు రావడంతో పోలీసుల సంఖ్య పెరగడంతో పాటు నిఘా పెరిగే అవకాశమున్నందున నేరాలు సంఖ్య తగ్గే సూచనలు ఉన్నాయి.

#### మరో నాలుగు ప్రతిపాదనలు..

మేడ్చల్ ఏసీపీ పరిధిలో జనాభాకు అనుగునంగా మరిన్ని పోలీస్ స్టేషన్లు ఏర్పడే ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. మేడ్చల్ మండలంలోని డబీల్‌పూర్‌లో రూరల్ పోలీస్‌స్టేషన్, గుండ్లపోచంపల్లిలో, మూడుచింతలపల్లిలో, తూంకుంటలో పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

#### స్థానికుల్లో హర్షం...

15 ఏళ్ల క్రితం పూర్తిగా గ్రామీణ ప్రాంతంలా ఉన్నా మేడ్చల్ అభివృద్ధికి అనుగుణంగా పోలీసు వ్యవస్థలో మార్పులు తెస్తున్నారు. దీంతో ప్రజల చేంతకు పోలీసులను తీసురావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.